# నేడు ఎల్లారెడ్డికి గులాబీ బాస్

- బోధన్, అర్బన్‌లోనూ సీఎం ప్రచారం
- బీఆర్ఎస్ అధినేత సుడిగాలి పర్యటన
- మూడు నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలు
- భారీ ఏర్పాట్లు చేసిన స్థానిక ఎమ్మెల్యేలు


ఎల్లారెడ్డిలోని సీఎం సభాస్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



నిజామాబాద్, నవంబర్ 14
(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ నేడు (బుధవారం) ఉమ్మడి జిల్లాకు రానున్నారు. రెండో విడుత ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒకే రోజు మూడు ప్రజా ఆశీర్వాద సభల్లో కేసీఆర్ పాల్గొనబోతున్నారు. మొదటగా బోధన్ నియోజకవర్గానికి వస్తారు. ఇక్కడ జరిగే ప్రజా సభలో మధ్యాహ్నం ఒంటి గంటకు పాల్గొంటారు. 2 గంటల తర్వాత నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలోని ప్రచార కార్యక్రమానికి హాజరవుతారు. ఈ సభను గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు ఇక్కడి సభ జరుగుతుంది. మధ్యాహ్నం 3గంటలకు కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరిగే ఎన్నికల ప్రచారానికి కేసీఆర్ హాజరవుతారు. ఆయా నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభలను స్థానిక ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వస్తున్న సీఎం కేసీఆర్.. మూడు నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటన చేస్తారు. అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తారు.

**రేపు నిజామాబాద్ రూరల్‌కు..**

ఇప్పటి వరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలను సీఎం కేసీఆర్ తన పర్యటనలతో దాదాపుగా చుట్టేశారు. బుధవారం జరగబోయే మూడు సభలతో ఉమ్మడి జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అధినేత ప్రచారం పూర్తయినట్లే. ఇక మిగిలింది నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం. ఇక్కడ కూడా గులాబీ బాస్ గురువారం పర్యటించనున్నారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి శివారులోని గాంధీనగర్‌లో ప్రజా ఆశీర్వాద సభకు స్థానిక ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఏర్పాట్లను పరిశీలించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల

ఎల్లారెడ్డి, నవంబర్ 14 : పట్టణంలో బుధవారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే జాజాల సురేందర్ మంగళవారం పరిశీలించారు. హెలిప్యాడ్ పనులను రోడ్లు భవనాల శాఖ డీఈఈ నారాయణను అడిగి తెలుసుకున్నారు. సభా ప్రాంగణం, వేదికను పరిశీలించి పలు సూచనలు చేశారు. సభకు సుమారుగా 50 వేల మంది వస్తారని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని డయాస్ ఇన్‌చార్జి నునుగొండ శ్రీనివాస్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ ఉషాగౌడ్, బల్దియా చైర్మన్ కుడుముల సత్యం, ప్రశాంత్ గౌడ్, నీలకంఠం, పృథ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

# అభిమాన నేతకు.. ఆత్మీయ స్వాగతం



వర్ని/నుస్రుల్లాబాద్, నవంబర్ 14: ఎన్నికల ప్రచారంలో భాగంగా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం వర్ని మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నేతకు ప్రజలు ఆత్మీయ స్వాగతం పలికారు. యువకులు, బీఆర్ఎస్ శ్రేణులు పటాకులు కాలుస్తూ, మహిళలు మంగళహారతులతో వచ్చి పూలు జల్లుతూ సభాపతిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా అన్ని వర్గాల ప్రజలతో స్పీకర్ మమేకమయ్యారు. తాను చేసిన అభివృద్ధిని చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు. డబ్బులు పట్టుకొని అహంకారంతో వస్తున్న కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వర్ని మండలంలో ప్రచారానికి వెళ్తున్న స్పీకర్ వాహనాన్ని ఎన్నికల అధికారులు నస్రుల్లాబాద్ శివారులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేశారు.

# బీఆర్ఎస్‌లోకి వలసలు


ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

కామారెడ్డి, నవంబర్ 14 : కామారెడ్డి మండలం శాబ్దిపూర్, భవానీపేట్, సింగారాయిపల్లి గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఆ పార్టీలకు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. మంగళవారం వారికి జిల్లా కేంద్రంలోని తన నివాసం వద్ద ప్రభుత్వ విప్ గంపగోవర్ధన్‌తోపాటు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై, భారీ మెజారిటీతో కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేసేందుకు సుమారు 200 మంది పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ పున్న రాజేశ్వర్, దోమకొండ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు, మాచారెడ్డి జడ్పీటీసీ మినుకూరి రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశంలో నంబర్ వన్ సీఎం కేసీఆర్

- ఎన్నికల ప్రచారం ప్రారంభించిన ప్రభుత్వ విప్
- బుగ్గ రామలింగేశ్వరుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు



ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రభుత్వ విప్


మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న గంప గోవర్ధన్

రామారెడ్డి/మాచారెడ్డి, నవంబర్ 14 : అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడంలో కేసీఆర్.. దేశంలోనే నంబర్ వన్ సీఎం అని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డినుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అధినేత తరఫున విప్ మంగళవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ముందుగా రామారెడ్డి మండలం మద్దికుంటలోని బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మద్దికుంటతోపాటు మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట, బంజపల్లి, సోమార్‌పేట, రత్నగిరిపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు మూడు గంటల కరెంటు చాలన్న రేవంత్‌రెడ్డిని తరిమి కొట్టాలన్నారు. గతంలో కాంగ్రెస్, టీడీపీలకు 11 సార్లు అవకాశం ఇస్తే వారు తెలంగాణకు ఏమీ చేయలేదన్నారు. పోరాడి సాధించిన తెలంగాణను సీఎం కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుతున్నరని వివరించారు. తన నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలనే ఆకాంక్ష మేరకే కేసీఆర్‌ను కామారెడ్డికి ఆహ్వానించినట్లు తెలిపారు. నిజామాబాద్ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, మాచారెడ్డి, రామారెడ్డి ఎంపీపీలు నర్సింగ్‌రావు, దశరథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ చరిత్ర సృష్టించడం ఖాయం

**నుడా మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు చామకూర ప్రభాకర్‌రెడ్డి**




ఖలీల్‌వాడి, నవంబర్ 14 : 'స్వరాష్ట్రం కోసం మలిదశ ఉద్యమంలో పాల్గొన్నాం. ఉద్యమనేత కేసీఆర్ అడుగుజాడల్లో పని చేశాం. అంతా అనుకున్నట్లుగానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నాం. 50ఏండ్ల సమైక్య పాలనలో జరగని అభివృద్ధిని.. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో చేసి చూపించాం. అభివృద్ధి ప్రదాతలకే పట్టం కడతారని' అంటున్నారు నుడా మాజీ చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుడు చామకూర ప్రభాకర్‌రెడ్డి. నమస్తే తెలంగాణతో పంచుకున్న అభిప్రాయం ఆయన మాటల్లోనే..

బీఆర్ఎస్ అంటేనే అభివృద్ధి. పదేండ్లలో నిజామాబాద్ నగరం చాలా అందంగా తయారైంది. 2001 నుంచి ఉద్యమంలో ఉన్నాను. రాష్ట్రం కోసం ఎన్నో పోరాటాలు చేశాం. సీఎం కేసీఆర్ దీక్షతో తెలంగాణని సాధించుకున్నాం. సాధించుకున్నట్టే తెలంగాణతోపాటు నిజామాబాద్‌ను అభివృద్ధి చేశాం. నగరంలో చేసిన అభివృద్ధి కండ్లకు కట్టినట్లు కనబడుతున్నది. నిజామాబాద్‌లో ఐటీ హబ్ ఏర్పాటు చేసి 700 మందికి ఉద్యోగులు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. రోడ్లను విస్తరించాం. డివైడర్లు ఏర్పాటు చేసి, మధ్యలో మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం ఏర్పడేలా చేశాం. వీధులన్నీ ఎల్ఈడీ లైట్ల వెలుగులు విరజిమ్ముతున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను బిగాల గణేశ్ గుప్తా పూర్తిచేశారు. సీఎం కేసీఆర్ సహకారంతో నూతన సమీకృత కలెక్టర్ భవనాన్ని నిర్మించాం. మినీట్యాంక్ బండ్, మాడ్రన్ వైకుంఠధామాలు, ఆర్‌యూబీ పనులను పూర్తి చేసి ట్రాఫిక్ కష్టాలను తీర్చాం. బీఆర్ఎస్‌కి పోటీ అనేదే లేదు. మా నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ కటౌట్ ఒక్కటి చాలు. ఇతర పార్టీలు గల్లంతు అవ్వాల్సిందే.

